క్లుప్తంగా

ప్రతీ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి



బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

దోమ: ప్రతీ ఉద్యోగికి బదిలీ తప్పనిసరని దోమ మండల ఎంపీడీఓ నరేందర్ పేర్కొన్నారు. దోమ మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించి హైదరాబాద్ సీఆర్పీకి బదిలీపై వెళ్తున్న మహేష్‌బాబు, దోమ ఎంపీఓగా విధులు నిర్వహిస్తూ చౌడాపూర్ మండలానికి ఎంపీడీఓగా వెళ్తున్న సోమలింగంకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమేనన్నారు. ఎక్కడ పనిచేసిన అంకితాభావంతో ప్రజలకోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏంపీఓ రాజేష్, విజయకుమార్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, బంగ్ల యాదయ్య, మల్లేశం, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వికారాబాద్ అధ్యక్షుడిగా మహిపాల్ రెడ్డి



మహిపాల్ రెడ్డి, అశోక్‌లను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా పులుసుమామిడి గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డిని, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మదనపల్లి గ్రామానికి చెందిన అశోక్ ఎంపికయ్యారు. మంగళవారం వికారాబాద్‌లోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల కోసం అందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేందర్ గౌడ్, శుభప్రద పటేల్, మాజీ ఎంపీపీ చంద్రకళ, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పోలవరం ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు



విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ శివారులో విద్యుత్ స్తంభాలకు మరమ్మతు పనులు మంగళవారం చేపట్టారు. గ్రామ లైన్‌మెన్ వెంకట్రాములు ఆధ్వర్యంలో విరిగిన విద్యుత్ స్తంభాలను మరమ్మతు చేశారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే విద్యుత్ లైన్ కావడంతో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మరమ్మతులు చేసినట్లు తెలిపారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

కుల్కచర్ల: సంతోష కర సమయమే కాదు.. ఇబ్బందికర సమయాల్లోనూ స్నేహితులు అండగా నిలుస్తారని నిరూపించారు. కుల్కచర్ల జెడ్పీ పాఠశాలలో 1992–93 పదోతరగతి విద్యార్థులు మొగులోజీకి సాయం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..కొన్నిరోజుల నుంచి అనారోగ్యంతో మొగులోజీ ఇబ్బందులకు గురవుతున్నాడనే విషయాన్ని తెలుసుకున్న పదోతరగతి స్నేహితులు నగరంలోని అతని ఇంటికి వెళ్లి రూ.50వేలు సాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్నేహం అంటే సంతోషమే కాకుండా కష్టాల్లో కూడా తోడుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీరంపల్లి రాజు, మాలె కృష్ణయ్య గౌడ్, శ్రీనివాస్, సత్యం, మల్లేశం, గోపాల్ రెడ్డి, ఆనంద్, రాములు, సుధాకర్, మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆగిన పనులు!

నిధులున్నా ముందుకు సాగని ఫోర్‌లేన్లు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు
- రోడ్డు విస్తరణను పట్టించుకోని అధికారులు



ఇరుకుగా ఉన్న కల్వర్టు

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో చేపట్టిన ఫోర్‌లేన్ల రోడ్డు వెడల్పు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. 8 సంవత్సరాల క్రితం మోమిన్‌పేటలో రెండు కిలో మీటర్ల మేర నాలుగు వరుసల రోడ్డు వెడల్పు పనులకు రూ.10కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. నాలుగు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టరు మధ్యలోనే ఆపేశాడు. రూ.10కోట్ల నిధులతో నాలుగు లేన్ల మేర రోడ్డును విస్తరించడంలో భాగంగా 900మీటర్ల సీసీ రోడ్డు, 1,100 మీటర్ల బీటీ రోడ్డును నిర్మించారు. కల్వర్టు నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు కెటాయించారు. ఇక ఏడాది క్రితం ప్రభుత్వం మారడంతో కల్వర్టు నిర్మించేందుకు కెటాయించిన నిధులతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు, రెండు ఫీట్ల ఎత్తుతో డివైడర్‌ను నిర్మించాలని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడం వలన మోమిన్‌పేట గ్రామదశ మారనుందని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. బీటీలో ఒక లేయర్ వేశారని ఇంకో లేయర్ వేయాల్సి ఉంది. ఈ పనులను పట్టించుకునే అధికారులు కరువయ్యారు. కల్వర్టు కోసం కెటాయించిన రూ.2కోట్ల నిధులతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తారని అధికారులు భావించారు. కాని డివైడర్ ఎత్తును పెంచేందుకు అదనపు నిధులు మంజూరు కావలసి ఉంది. దీంతో అక్కడ పనులు చేసేందుకు సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. డివైడరు నిర్మాణానికి నిధులు లేక ఏడాది కాలంగా సెంట్రల్ లైటింగ్ సిస్టం కోసం కెటాయించిన నిధులు వృథాగానే మిగిలిపోయాయి. అటుకల్వర్టు నిర్మాణ పనులు...ఇటు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నాలుగు వరుసల రోడ్డు వెడల్పునకు మంజూరైన నిధులతో పనులు పూర్తి చేసి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తదనంతరం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటునకు అదనపు నిధులకోసం ప్రభుత్వాన్ని కోరి ఉంటే బాగుండేదని స్థానికులు చెబుతున్నారు. ఇరుకుగా ఉన్న కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి, డివైడరు ఎత్తు పెంచి, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి ఈ పనులను పూర్తి చేయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



మోమిన్‌పేటలో ఏర్పాటు చేయని సెంట్రల్ లైటింగ్

త్వరలో పనులు చేయిస్తాం

కల్వర్టు నిర్మాణానికి కేటాయించిన రూ.2కోట్ల వరకు నిధులు ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజల సంక్షేమం దృష్ట్యా సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు కోసం నిధులు మళ్లించారు. కానీ డివైడరు ఎత్తు పెంచేందుకు నిధులు లేక పనులు ఆగిపోయాయి. ప్రభుత్వానికి ఈ పనులకోసం అంచనాలను సిద్ధం చేసి పంపించాం. నిధులు మంజూరైన వెంటనే డివైడరు ఎత్తు పెంచి సెంట్రల్ లైటింగ్ సిస్టిం ఏర్పాటు చేయిస్తాం.

– సుశ్రిత ఏఈఈ ఆర్‌అండ్‌బీ, మోమిన్‌పేట

ప్రణాళికబద్ధంగా చదవాలి

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

బంట్వారం: పదోతరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేషం తదితరులతో కలిసి బంట్వారం కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రతిఒక్కరూ బాగా చదివి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ధైర్యంగా చెప్పాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. అక్కడి నుంచి నేరుగా సుల్తాన్‌పూర్‌కు వెళ్లి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేషం, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈఓ వెంకటేశ్వర్ రావు, ఏఎంసీ డైరెక్టర్లు యాదగిరి, నర్సింలు, ఇసాక్, నాయకులు హరీశ్వర్‌రెడ్డి, శాకం రాములు, పి వెంకటయ్య, అంజిరెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యం

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్



బ్యాటింగ్ చేస్తున్న ధారాసింగ్ తదితరులు

తాండూరు రూరల్: క్రీడలతోనే ఆరోగ్యం చేకూరుతుందని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తట్టెపల్లి గ్రామంలో సేవాలాల్ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ.. కర్ణాటక సరిహద్దులోని గ్రామాలు, తండాల్లో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు తమ ప్రతిభను వెలికితీసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి, క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ ఎంపీటీసీలు శంకర్, లక్ష్మణ్, నర్సిములు, కిష్టప్ప, విద్యాసాగర్, విష్ణు, ప్రేమ్, సురేశ్, రాంరెడ్డి, సంజు, దేవ్‌సింగ్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి



మర్పల్లి: కోట్‌మర్పల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రామేశ్వర్ రెడ్డి

మర్పల్లి: గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల రామేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామానికి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి సీసీ రోడ్లు వేసేందుకు రూ.5లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి రామేశ్వర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ పథకం కింద పారిశుద్ధ్యం పనుల కోసం ప్రతీ నెల గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తుందని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో శ్మశాన వాటిక, కాంపోస్ట్‌షెడ్, ఉపాధిహామీ పథకం కింద రోడ్లు వేసేందుకు కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు బలరాంగౌడ్, మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి, యాదవరెడ్డి, సుభాష్, బిచ్చిరెడ్డి, సంతోశ్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో సైబేజ్ స్వచ్ఛంద సంస్థ చేయూత అభినందనీయమని మాజీ సర్పంచ్ సంధ్యాభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని దేవనోనిగూడ, సోమన్‌గుర్తి గ్రామాలను సైబేజ్ స్వచ్ఛంద సంస్థ దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రూ.13 లక్షలతో దేవనోనిగూడ, సోమన్‌గుర్తి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సైబేజ్ కంపెనీ సీఎస్ఆర్ అనపురపు సురేష్, సర్పంచ్ బుచ్చన్న, సీనియర్ నాయకులు సీతారాంరెడ్డి, నారాయణ, విశ్వనాథం, యాదయ్య, మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ



కార్యవర్గ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు

దుద్యాల్: పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గ ఎన్నికలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా దుద్యాల్ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కుదురుమల్ల పంచాయతీ కార్యదర్శి రాధ, ప్రధాన కార్యదర్శిగా ఆనందం, జాయింట్ సెక్రెటరీగా కృష్ణ గౌడ్, ఉపాధ్యక్షుడిగా మోహన్, జాయింట్ సెక్రెటరీగా రమేశ్ రాథోడ్, కోశాధికారిగా కిషన్, అరుణ జ్యోతి ఈసీ మెంబర్‌గా రాధిక, సూర్యప్రకాశ్, సభ్యులుగా వెంకటేశ్, యాద గిరి, భరత్, ఆనంద్, హరీశ్వర్ రెడ్డి, రాజు, పుష్పలత, శ్రీవాణిలను ఎన్నుకున్నారు.

టీబీ నివారణకు వైద్య పరీక్షలు అవసరం

కుల్కచర్ల: టీబీ నివారణకు వైద్య పరీక్షలు అవసరమని, ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ అసిస్టెంట్ శరభలింగం పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఎక్స్‌రే క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ, భవానీసింగ్, శ్రీనివాసులు, రాజు, పుష్ప, రాములమ్మ, భాస్కర్, కృష్ణ, స్వాతి, నర్సింగమ్మ, పార్వతమ్మ, కమలమ్మ, అంజమ్మ, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

రైతుదీక్షలంటూ కేటీఆర్ కాలక్షేపం



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

కుల్కచర్ల: రైతుదీక్షలంటూ కాలక్షేపం చేయడం తప్ప కేటీఆర్ చేస్తున్నదేమి లేదని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక కేటీఆర్ రైతుదీక్షలంటూ తిరుగుతున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని రైతులు ఇప్పుడు గుర్తుకురావడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. లక్ష రుణమాఫీ చేస్తామంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు కాలయాపన చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.2లక్షల రుణమాఫీని చూసి జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, యువజన విభాగం మండల అధ్యక్షుడు జంగయ్య, మార్కెట్ కమిటీ డైరక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, ఎల్లయ్య, బాబు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’ స్టడీ మెటీరియల్ పంపిణీ



గోట్లపల్లి మోడల్ స్కూల్లో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్ఆర్ చేతన్‌కుమార్



కోట్‌పల్లిలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గోట్లపల్లి సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల్లో మంగళవారం సాక్షి దినపత్రిక (జగతి పబ్లికేషన్) ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్క్యులేషన్ ఎస్ఆర్ చేతన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గాయత్రి, పత్రిక సిబ్బంది చందు, పాఠశాల అధ్యాపకుల బృందం, తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాక్షి యాజమాన్యం తరఫున మంగళవారం బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో సంస్థ ప్రతినిధులు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సాక్షి అందించే మెటీరియల్ ఎంతో మేలు చేస్తుందన్నారు. పరీక్షల సమయంలో బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి ప్రతినిధులు చేతన్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



భోజన్నగడ్డ తండాలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని భోజన్నగడ్డ తండా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, అధికారులుగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తోటి విద్యార్థులకు ఒక్కరోజు పాఠాలు బోధించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్‌గా ప్రవళిక, డీఈఓగా ఇందు, ఎంఈఓగా అరవింద్, హెచ్‌ఎంగా దీపిక, ఉపాధ్యాయులుగా కావ్యశ్రీ, దివ్యశ్రీ, అర్చన, మునేశ్, శ్రీలత బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ బహుమతులు అందజేసి అభినందించారు.

బిల్లులు విడుదల చేయాలని ధర్నా



ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయకులు

కుల్కచర్ల: ‘మన ఊరు మనబడి’పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల్కచర్ల మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మన ఊరు మనబడిలో భాగంగా సర్పంచులు, ఎస్ఎంసీ చైర్మన్లు అప్పులు చేసి పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ పనులు నిర్వహించి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికి పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం నామమాత్రపు నిధులు విడుదల చేసి నిర్వాహకులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రవిచందర్, చంద్రయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

బొంరాస్‌పేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పేదల సంక్షేమానికి కృషి చేసే ఏకైక పార్టీ అని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏర్పుమళ్ల గ్రామానికి చెందిన కోట్ల చంద్రయ్య కుటుంబానికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.29వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం అందజేసే సీఎంఆర్ఎఫ్ నిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, జానకంపల్లి అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న వెంకట్రాములుగౌడ్

సంక్షిప్త వార్తలు

• నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

తాండూరు రూరల్: తాండూరు మండల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశం రాంపూర్ గేటు సమీపంలో నూతనంగా నిర్మించిన ఎల్మకన్నె పీఏసీఎస్ గోదాంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కావున మండలంలోని ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

• నేడు దస్తగిరిపేట్‌లో కల్యాణం, రథోత్సవం

తాండూరు రూరల్: మండల పరిధిలోని దస్తగిరిపేట్‌లో శ్రీదేవిభూదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు వెంకటాచార్ శుక్రవార్, రాఘవాచార్ శుక్రవార్, పురందరాచార్ శుక్రవార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్వామివారి కల్యాణోత్సవం అనంతరం రథోత్సవం, అన్నదానం, సాయంత్రం అశ్వవాహన సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

• నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం కలుగుతుందని పరిగి విద్యుత్ ఏఈ హరిక్రిష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీలో కొత్తలైన్ల కోసం పనులు నిర్వహిస్తున్న సందర్భంగా పట్టణ కేంద్రంలోని సన్‌సిటీ కాలనీ, జయంతినగర్‌కాలనీ, కెఆర్ఆర్ కాలనీ, ఎస్ఆర్‌బి కాలనీ, మధురానగర్, లక్ష్మీనగర్, ఆర్టీసీ కాలనీ, వేంకటేశ్వరకాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని హరిక్రిష్ణ కోరారు.

• ఎంపీడీఓ కార్యాలయాల్లో ఓటరు జాబిత

దౌల్తాబాద్: మండలంలోని 33 గ్రామపంచాయతీల పరిధిలో 41,758 మంది ఓటర్లు ఉన్నారని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఓటర్ లిస్టలను ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ జాబితాలో 20,459 మంది పురుషులు 21,295 మంది మహిళా ఓటర్లు, 04 ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, రెండు రోజుల్లో రిటర్నింగ్ అధికారులతో పాటు ఏఆర్ఓ, ఓపీఓలకు మండల కేంద్రంలో శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

• మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

దుద్యాల్: మండలంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు బుధవారం అంతరాయం ఏర్పడనున్నట్లు మిషన్ భగీరథ ఏఈ సాయినాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొడంగల్–నాజుఖాన్‌పల్లి గ్రామాల మధ్యలో నేషనల్ హైవే పనులు కొనసాగుతున్న సందర్భంగా మండలానికి సరఫరా అయ్యే మిషన భగీరథ ప్రధాన పైపులైన్ (డీఐ) పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. మరమ్మతుల అనంతరం నీటిసరఫరాను కొనసాగిస్తామని తెలిపారు.

మహాకుంభ మేళాకు బషీరాబాద్ వాసులు

బషీరాబాద్: మహాకుంభ మేళాకు బషీరాబాద్ నుంచి భారీగా భక్తులు తరలివెళ్లారు. మండలంలోని క్యాద్గీరా, జీవన్గీ, నవల్గా, కాశీంపూర్ గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమంలో మంగళవారం పుణ్యస్నానాలు చేశారు. అక్కడి నుంచి అయోధ్యలోని శ్రీ బాలరాముడిని, కాశీలో విశ్వనాథున్ని దర్శించుకున్నారని వారు తెలిపారు. మహాకుంభమేళాకు తరలివెళ్లిన వారిలో మాజీ ఎంపీటీసీ నాగేంద్రయ్య, ఉపాధ్యాయుడు రవికుమార్ సుగంధి, మేకల నర్సిములు, మాడపతి జగదీశ్వర్, విష్ణుమూర్తి, అడ్వకేట్ విశ్వనాథ్ దంపతులు తదితరులు ఉన్నారు.